ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5

అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 11 ఆగస్టు 2025





స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి రాఖీ కడుతున్న హోం మంత్రి అనిత

స్పీకర్ అయ్యన్నకు రాఖీ కట్టిన మంత్రి అనిత

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడుకి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత రాఖీ కట్టారు. ఆదివారం తాండవ రిజర్వాయర్ నీటి విడుదల కార్యక్రమానికి హాజరైన ఆమె నర్సీపట్నంలో స్పీకర్‌కు ఇంటికి వెళ్లారు. అయ్యన్నకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్, దివ్యశ్రీ దంపతులు ఆమెకు ఏటికొప్పాక లక్క బొమ్మలను బహూకరించారు.

-నర్సీపట్నం/ ఆంధ్రజ్యోతి

బోర్డు తిప్పేసిన ఇఫ్కో

నర్సీపట్నంలో నెట్‌వర్క్ మార్కెటింగ్ సంస్థ మోసం

- డీలర్‌షిప్ పేరుతో పలువురి నుంచి డబ్బులు వసూలు
- వ్యాపార లాభాల్లో ఐదు శాతం వాటా ఇస్తామనడంతో పలువురి చేరిక
- మూడు నెలల తరువాత కార్యకలాపాలు నిలిపివేత
- డబ్బులు తిరిగి ఇచ్చేయాలని డీలర్ల డిమాండ్
- చెల్లని చెక్కులు ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు

నర్సీపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

సమగ్ర రైతు సహకార సంస్థ (ఇఫ్కో) బోర్డు తిపేసింది. వ్యాపారంలో వచ్చే లాభాల్లో వాటా ఇస్తామంటూ డీలర్‌షిప్ పేరుతో పలువురి నుంచి రూ.5 లక్షల చొప్పున వసూలు చేసి కుచ్చు టోపీ పెట్టింది. సంస్థ బాధితుల్లో ఒకరైన జి.లావణ్య నర్సీపట్నం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఫిర్యాదులో పేర్కొన్న వివరాలిలా వున్నాయి.

పెదబొడ్డేపల్లిలోని మునిసిపల్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో పందిరిపల్లి శ్రీనివాసరావు అనే వ్యక్తి గత ఏడాది డిసెంబరులో 'సమగ్ర రైతు సహకార సంస్థ' (ఇఫ్కో)ను ఏర్పాటు చేశాడు. మిడతపాటి వెంకటలోవ అనే వ్యక్తి మేనేజర్‌గా పనిచేసేవాడు. ఇందులో సభ్యులుగా చేరిన వారికి తొలుత రూ.1,000 విలువగల నిత్యావసర సరుకులు ఇచ్చి ప్రతి వారం రూ.250 చొప్పున నాలుగు వారాలపాటు వసూలు చేసేవారు. మరోవైపు తమ సంస్థలో రూ.5 లక్షల చొప్పునపెట్టుబడిపెట్టి డీలర్‌షిప్ తీసుకుంటే, సంస్థ వ్యాపారంలో వచ్చే లాభాల్లో ఐదు శాతం ఇస్తానని నమ్మబలికాడు. దీంతో పట్టణానికి పలువురు రూ.5 లక్షల చొప్పున ఇచ్చి, సంస్థతో ఒప్పందం రాయించుకున్నారు. మూడు, నాలుగు నెలల తరువాత సంస్థలో కార్యకలాపాలు (నిత్యాసర సరుకుల అమ్మకం) నిలిపిచేశారు. దీంతో అనుమానం వచ్చిన డీలర్లు.. తమ డబ్బులు వెనక్కు ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. 45 రోజుల తర్వాత ఇస్తామని ప్రాజెక్ట్ డైరెక్టర్, బ్రాంచ్ మేనేజర్ చెప్పారు. ఈ మేరకు పోస్టుడేటెడ్ చెక్కులు ఇచ్చారు. గడువు ముగిసిన తరువాత చెక్కులను బ్యాంకులో డిపాజిట్ చేయగా, సదరు సంస్థ ఖాతాలో డబ్బులు లేకపోవడంతో బౌన్స్ అయ్యాయి. దీంతో మోసపోయామని భావించిన ... మిగతా 6వ పేజీలో



పెదబొడ్డేపల్లిలో సమగ్ర రైతు సహకార సంస్థ కార్యాలయం (ఫైల్ ఫొటో)

ఇంటికి రాని కొళాయి!

కదలిక లేని జల్ జీవన్ మిషన్ పనులు

- ఆరేళ్ల క్రితం పథకాన్ని ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- జిల్లాలో తొలివిడత 54,677 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రణాళిక
- 2022-23లో రూ.80.17 కోట్లతో పనులు ప్రారంభం
- సకాలంలో నిధులు విడుదల చేసిన కేంద్రం
- రాష్ట్ర వాటా సొమ్ము విడుదల చేయని నాటి వైసీపీ ప్రభుత్వం
- బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం
- గత ఏడాది ఎన్నికల ముందే పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- అప్పటి వరకు 27,823 ఇళ్లకు మాత్రమే కొళాయిలు ఏర్పాటు
- మిగిలిన పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ప్రతిపాదనలు
- రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం నిరీక్షణ



మారేడుపూడిలో మోటారు బిగించని బోరు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గ్రామాల్లో ఇంటింటికీ కొళాయి ద్వారా రక్షిత తాగునీటిని సరఫరా చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి ఆధ్వర్యంలో చేపట్టిన 'జల్ జీవన్ మిషన్' పథకం పనులు జిల్లాలో ముందుకు సాగడం లేదు. ఈ పథకాన్ని ప్రారంభించి ఆరేళ్లు పూర్తి కావస్తున్నప్పటికీ కొలిక్కిరాలేదు. గత వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేయడం, కొంతమంది కాంట్రాక్టర్లు పనులు మధ్యలో ఆపేయడం వంటి కారణాల వల్ల జిల్లాలో ఇంతవరకు సగం నివాసాలకు మాత్రమే కొళాయిలు ఏర్పాటు చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పూర్తిగా నివారించడానికి కేంద్ర ప్రభుత్వం 2019లో జల్ జీవన్ మిషన్ పథకాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం వున్న తాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, అవసరమైన మేర బోర్లు తవ్వడం, కొత్తగా తాగునీటి ట్యాంకులు నిర్మించడం, పైపులైన్లు వేసి ఇంటింటికీ కొళాయి బిగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. ఇందుకు అయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాలి. పంచాయతీల్లో వున్న జనాభాకు ... మిగతా 6వ పేజీలో



కశింకోట మండలం మూలపేట పంచాయతీ గంగాదేవిపేటలో జల్ జీవన్ పనులు (ఫైల్ ఫొటో)



తాండవ ఆయకట్టుకు నీటి విడుదల సందర్భంగా రెగ్యులేటర్ వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి వి.అనిత

కూటమి హయాంలోనే తాండవ అభివృద్ధి

ఏడాదిలో రూ.8 కోట్లతో పలు పనులు

- మరో రూ.20 కోట్లు మంజూరుకు జలవనరుల శాఖ మంత్రి సానుకూలత
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడి
- హోం మంత్రి అనితతో కలిసి ఆయకట్టుకు నీరు విడుదల

నాతవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాది కాలంలోనే రూ.8 కోట్లతో తాండవ రిజర్వాయర్ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేశామని శాసనసభ స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు అన్నారు. హోం మంత్రి అనితతో కలిసి ఆదివారం మధ్యాహ్నం తాండవ జలాశయం నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆనకట్ట వద్ద పూజలు నిర్వహించి, జలహారతి ... మిగతా 6వ పేజీలో

చురుగ్గా విద్యుత్ సబ్ స్టేషన్ పనులు

లక్ష్మీపురం వద్ద ఇప్పటికే 60 శాతం పూర్తి

- రెండు నెలల్లో అందుబాటులోకి..
- చోడవరం, పరిసర పంచాయతీలకు తీరనున్న కరెంటు కష్టాలు



సబ్‌స్టేషన్ వద్ద పూర్తయిన కాంక్రీట్ బేస్‌మెంట్

చోడవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

చోడవరం మేజర్ పంచాయతీసహా, మరో తొమ్మిది పంచాయతీలు, రెండు శివారు గ్రామాల ప్రజల కరెంటు కష్టాలు త్వరలో తీరనున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సరఫరాలో ఈ గ్రామాల విద్యుత్ వినియోగదారుల ఇబ్బందులు విజయదశమి నాటికి గట్టెక్కనున్నాయి.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత 33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చోడవరం శివారు లక్ష్మీపురం పంచాయతీ సమీపంలో ఈ ఏడాది జూన్ నెలాఖరున ప్రారంభించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మరోవైపు సబ్‌స్టేషన్ నుంచి ఆయా పంచాయతీలకు విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు, లైన్లు వేస్తున్నారు. అలాగే చీడికాడ రోడ్డులో ఉన్న మరో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు దీనిని అనుసంధానం చేయడానికి అవసరమైన లైన్లు వేస్తున్నారు. కొత్త సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే చోడవరం పట్టణంతోపాటు చుట్టుపక్కల వున్న గాంధీగ్రామం, నరసయ్యపేట, అంకుపాలెం, శ్రీరాంపట్నం, గౌరీపట్నం, ఖండేపల్లి, దామునాపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం పంచాయతీలు, శివారు గ్రామాలైన రేవళ్లు, పీఎస్‌పేటలకు విద్యుత్ కష్టాలు తీరనున్నాయి. వాస్తవానికి ఇక్కడ విద్యుత్ సబ్ స్టేషన్ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే మంజూరైంది. దీని నిర్మాణానికి నరసయ్యపేట వద్ద ఎంపిక చేసిన స్థలంపై వివాదం కారణంగా వాయిదా పడింది. తరువాత నరసయ్యపేట వద్ద స్థలం సమస్య తొలగినప్పటికీ, నాటి వైసీపీ పాలకులు సబ్‌స్టేషన్ నిర్మాణంపై దృష్టిపెట్టలేదు. పైగా చోడవరానికి మంజూరైన సబ్‌స్టేషన్ వేరే ప్రాంతానికి తరలిపోయింది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు దీనిపై దృష్టిసారించారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ... మిగతా 6వ పేజీలో



సైట్‌లో సబ్‌స్టేషన్ నిర్మాణ సామగ్రి



టవర్ నిర్మాణ పనుల్లో నిమగ్నమైన కార్మికులు

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

బయ్యవరంలో బైక్‌ను ఢీకొన్న వ్యాన్

మహిళ మృతి, భర్తకు గాయాలు

అనకాపల్లి వద్ద వ్యాన్‌ను ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్రగాయాలు
- కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి

జైతవరంలో విద్యుదాఘాతంతో మహిళ..

- పొలంలో గడ్డి కోస్తుండగా తెగిపడిన విద్యుత్ తీగ

జిల్లాలో ఆదివారం జరిగిన వేర్వేరు సంఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. వీరిలో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో చనిపోగా, మరొకరు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డారు.



సిగిరెడ్డి సత్యవతి (ఫైల్‌ఫొటో)



పాలూరి వెంకటేశ్ (ఫైల్ ఫొటో)



లాలం లక్ష్మణమ్మ (ఫైల్ ఫొటో)

కశింకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని బయ్యవరం జంక్షన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతిచెందారు. ఈ సంఘటనలో ఆమె భర్తకు గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి.

కశింకోట మండలం బయ్యవరం హౌసింగ్ కాలనీకి చెందిన సిగిరెడ్డి వెంకటరమణ, సత్యవతి(51)తో కలిసి ఆదివారం ఉదయం సొంతపనుల కోసం ద్విచక్ర వాహనంపై అనకాపల్లి వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి బయలుదేరారు. బయ్యవరం జంక్షన్ వద్ద కుడివైపునకు మళ్లారు. ఇదే సమయంలో ఎలమంచిలి వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న అశోక్ లేల్యాండ్ వ్యాన్‌ను, దాని వెనుక వస్తున్న ఐషర్ వ్యాన్ బలంగా ఢీకొన్నది. దీంతో అశోక్ లేల్యాండ్ వ్యాన్, బైక్‌ను ఢీకొనడంతో సత్యవతి రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. వెంకటరమణకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వెంకటరమణను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన రెండు వ్యాన్ల డ్రైవర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సొంతూరు విజయనగరం జిల్లా అంబటివలస

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

జాతీయ రహదారిపై వెళుతున్న వ్యాన్‌ను, వెనుక వస్తున్న బైక్ ఢీకొనడంతో ఒక యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతిచెందాడు. ఇందుకు సంబంధించి అనకాపల్లి పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం అంబటివలసకు చెందిన పాలూరి వెంకటేశ్ (26) అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని హెటిరో కంపెనీలో పనిచేస్తున్నాడు. విధులకు హాజరుకావడానికి ఆదివారం ... మిగతా 6వ పేజీలో

పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు!

పనుల ఒప్పందం సమయంలోనే డిమాండ్

- బిల్లుల చెల్లింపునకు మళ్లీ బేరాలు
- విశాఖ ఎస్ఈ కార్యాలయంలో సొంత కోటరీ
- గిరిజన సంక్షేమశాఖ ఈఎన్‌సీ నిర్వాకం



విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి):

లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన గిరిజన సంక్షేమశాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ ఎ.శ్రీనివాస్ అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. విశాఖలో ఎస్ఈగా పనిచేస్తున్న సమయంలో ఇక్కడి కార్యాలయంలో పనిచేసే సిబ్బందితో సొంత కోటరీని ఏర్పాటు చేసుకుని, కాంట్రాక్టర్లతో బేరాలు నడిపేవారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షలు విలువైన పనులుచేసి, బిల్లుల కోసం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగిన కొందరు కాంట్రాక్టర్లలో ఒకరు తాము ఎదుర్కొన్న ఇబ్బందులను 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

టెండర్లద్వారా పనులు దక్కించుకున్న తరువాత అగ్రిమెంట్ కుదుర్చుకోవాలి. ఆ తరువాత పనులు చేసిన మేరకు పార్టు బిల్లులు, చివరకు ఫైనల్ బిల్లులు చెల్లిస్తారు. సాధారణంగా ప్రభుత్వ ఇంజనీరింగ్ శాఖల్లో బిల్లుల సమయంలోనే పర్సంటేజ్‌లు తీసుకుంటారు. బిల్లులో సుమారు 10 శాతం అన్నిస్థాయి అధికారులకు ఇవ్వాల్సిందే. ఇది బహిరంగ రహస్యం. అయితే గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖలో ఎస్ఈగా పనిచేసిన శ్రీనివాస్ మాత్రం రెండుసార్లు పర్సంటేజీలు వసూలు చేసేవారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. పనికి సంబంధించి అగ్రిమెంట్ కుదుర్చుకునేటప్పుడు పనివిలువలో ఒక శాతం, ఎస్ఈ కార్యాలయంలో సిబ్బందికి అర శాతం వసూలు చేసేవారంటున్నారు. తరువాత పెట్టిన ప్రతి బిల్లు మంజూరుకు ఒక శాతం ఇచ్చుకోవాల్సిందేనని, లేదంటే కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించేవారని వాపోయారు. ఏదైనా కారణంతో మధ్యలో నిలిచిపోయిన పనులు తిరిగి చేపట్టే సమయంలో ఎస్టిమేట్లు పెంచితే మళ్లీ వేరుగా పర్సంటేజీలు తీసుకునేవారని చెబుతున్నారు. ఎస్ఈ కార్యాలయంలో పనిచేసే సిబ్బందిలో కొందరిని ఎంపికచేసి వారితో తిరుగులేని కోటరీ ఏర్పాటు ... మిగతా 6వ పేజీలో

ఇంటికి రాని కొళాయి!

... 5వ పేజీ తరువాయి

అనుగుణంగా నిధులు కేటాయింపు జరిగింది. జిల్లాలో 2022-23 సంవత్సరంలో ఈ పథకం కింద రూ.80.17 కోట్ల అంచనాలతో 405 పనులు చేపట్టడం ద్వారా 54,677 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. అప్పట్లో జల్ జీవన్‌మిషన్ పనులకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేసినప్పటికీ.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయలేదు. పైగా కేంద్రం ఇచ్చిన నిధులను వేరే అవసరాలకు మళ్లించింది. ఫలితంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందలేదు. చాలా వరకు పనులు ఆపేశారు. మొత్తం మీద గత ఏడాది వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి 27,823 ఇళ్లకు మాత్రమే కొళాయిలు ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు ఇంజనీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో చేసిన పనులు నాసిరకంగా వున్నాయి. ముఖ్యంగా నాణ్యతలేని పైపులు వాడడంతో వేసిన కొద్ది రోజులకే పగిలిపోయాయి. అనకాపల్లి, కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం మండలాల్లో పైపులేన్లు వేసినప్పటికీ, ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా సగానికిపైగా పనులు పూర్తికాలేదు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులను పునరుద్ధరించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. కానీ గతంలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సుమారు రూ.4.3 కోట్లు చెల్లించకపోవడంతో కొత్తగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే కొత్తగా ప్రతిపాదించిన పనులు చేపడతామని స్పష్టంచేశారు. దీంతో పెండింగ్ బిల్లులు చెల్లించడానికి నిధులు విడుదల చేయడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి చేతులు దులుపుకున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించి, సంబంధిత అధికారులను ప్రశ్నించారు.

జిల్లాలో జల్ జీవన్ మిషన్ పనులు పునరుద్ధరణ కాకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. గతంలో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం కారణంగా కొంతమంది కాంట్రాక్టర్లు పనులు మధ్యలో ఆపేశారని చెప్పారు. నిధుల విడుదలతోపాటు పనులను పునఃప్రారంభించడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని చెప్పారు. నిధులు విడుదలైన వెంటనే చెల్లింపులు జరిపి, పనులు మొదలుపెట్టిస్తామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. దారిలో అనకాపల్లి 'డైట్' కళాశాల దాటిన తరువాత ముందు వెళుతున్న వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. వెంకటేశ్ అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చీడికాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పొలంలో గడ్డి కోస్తున్న మహిళపై విద్యుత్ తీగ తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ బి.సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన లాలం లక్ష్మణమ్మ ఆదివారం ఉదయం బి.సింగవరం సమీపంలో వున్న తన పొలంలో గడ్డి కోసుకురావడానికి వెళ్లింది. పొలంలో నుంచి విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. ఆమె గడ్డికోస్తుండగా విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో ఆమె విద్యుదాఘాతానికి గురైంది. పొలానికి వెళ్లిన లక్ష్మణమ్మ ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ లక్ష్మణమ్మ నిర్జీవంగా పడివుంది. ఆమెను ఆనుకొని విద్యుత్ తీగవుంది. దీంతో ఆమె భర్త పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సతీశ్, పోలీసు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు!

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారని, వారంతా అతని వర్గానికి చెందినవారేనని పేర్కొంటున్నారు.

అధికారులకు వేధింపులు

విశాఖ సర్కిల్ పరిధి సీతంపేటలో పనిచేసిన ఈఈ ఒకరు ఎస్ఈ శ్రీనివాస్ పనితీరు నచ్చక విభేదించారు. దీంతో సదరు ఈఈని నెల్లూరు బదిలీచేశారు. అతడు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుని ప్రస్తుతం ఇక్కడే పనిచేస్తున్నారు. గతంలో పార్వతీపురం ఎస్ఈగా పనిచేసిన అధికారిని తీవ్రంగా వేధించడంతోపాటు తనకున్న పలుకుబడితో అక్కడి ఎస్ఈ కార్యాలయాన్ని రద్దుచేయించారు. అక్కడ పనిచేసే ఎస్ఈని ఈఈగా రివర్షన్ చేశారు. ఈఈగా పనిచేసిన మరో అధికారిని డీఈగా రివర్షన్ చేయగా, చివరకు అదే కేడర్‌లో అతను ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో విశాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అతని మనుషులు ఇప్పటికే కొన్ని ఫైళ్లు దాచేశారని తాజాగా ప్రచారం జరుగుతోంది. వాటిలో అనేక లోపాలు ఉండడంతో పొరపాటున ఏసీబీ అధికారులకు దొరికితే ఇబ్బందులు ఎదురవుతాయనే అప్రమత్తమయ్యారని కాంట్రాక్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

కూటమి హయాంలోనే తాండవ అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. అనంతరం తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన ఆయకట్టు రైతులతో నిర్వహించిన సభలో స్పీకర్ మాట్లాడుతూ, తాండవ అభివృద్ధికి మరో రూ.20 కోట్లు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరగా, త్వరలో మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. తాండవ రహదారిని జలవనరుల శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు బదిలీ చేశామని, ఈ రహదారి అభివృద్ధికి త్వరలో రూ.8 కోట్లు మంజూరు అవుతాయని వెల్లడించారు. గొలుగొండ-నాతవరం మండలాలను కలిపే రహదారికి తాండవ జలాశయం వద్ద రక్షణగోడ నిర్మిస్తామన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీటి రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ అనురాధ, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, నర్సీపట్నం, తుని ఏఎంసీల చైర్మన్‌లు గవిరెడ్డి వెంకటరమణ, అంకంరెడ్డి రమేశ్, కూటమి నాయకులు లాలం కాశీనాయుడు, నందిపల్లి వెంకటరమణ, జోగిబాబు, పారుపల్లి దాసు, తాండవ ప్రాజెక్టు ఈఈ బాలసూర్య, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దార్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

... 5వ పేజీ తరువాయి

లక్ష్మీపురం వద్ద స్థలం సమకూర్చడంతో వెంటనే నిర్మాణ పనులు మొదలుపెట్టారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా

చోడవరంలో ప్రస్తుతం వున్న సబ్‌స్టేషన్ కింద సుమారు 20 వేల విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. వీటిలో 11 వేల కనెక్షన్లు ఒక్క చోడవరం పట్టణంలోనే వున్నాయి. నానాటికీ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడం, మరోవైపు విద్యుత్ వినియోగం అధికం కావడంతో సబ్‌స్టేషన్‌పై లోడ్ పెరిగిపోతున్నది. దీంతో అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్‌పై లోడు తగ్గించడానికి పంచాయతీలకు సరఫరా నిలిపివేసి చోడవరం పట్టణానికి సరఫరా ఇస్తున్నారు. మరికొన్నిసార్లు చోడవరానికి సరఫరా ఆపేసి, చుట్టుపక్కల పంచాయతీలకు విద్యుత్ ఇస్తున్నారు. దీనివల్ల కరెంటు ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే రాజు, మరో సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంతవరకు సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు నెలల్లో ఇది అందుబాటులోకి వస్తుందని, దీంతో విద్యుత్ సమస్యలు వుండవని అధికారులు చెబుతున్నారు.

పీఏసీఎస్‌లకు పాలకవర్గాల నియామకం

చైర్‌పర్సన్‌గా నాగులాపల్లికి భాస్కరరావు, మునగపాకకు నూక నర్సింగరావు, చూచుకొండకు నర్సింగరావు

మునగపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు చైర్‌పర్సన్ల నియామకం జరిగింది. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. నాగులాపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మాజీ సర్పంచ్ యల్లపు వెంకటభాస్కరరావు, డైరెక్టర్లుగా కె.సత్యపార్వతి జగదీశ్వరరావు, సుందరపు శ్రీనివాసరావులను నియమించారు. అదేవిధంగా మునగపాక సొసైటీ చైర్‌పర్సన్‌గా విల్లూరి నూక నర్సింగరావు, డైరెక్టర్లుగా మొల్లి అప్పలరాజు, పి.రామారావులను నియమించారు. అలాగే చూచుకొండ సొసైటీ చైర్‌పర్సన్‌గా పెంటకోట నర్సింగరావు, డైరెక్టర్లు పి.రఘురామ్, కర్రి వెంకినాయుడులను నియమించారు. వీరి పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి 30వ తేదీతో ముగియనుంది.



వెంకట భాస్కరరావు, నాగులాపల్లి



వి. నూకనర్సింగరావు, మునగపాక



పి. నర్సింగరావు, చూచుకొండ

దిమిలి సొసైటీ చైర్‌పర్సన్‌గా శివశంకర్

రాంబిల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమిలి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గోకివాడకు చెందిన పొట్నూరి శివశంకర్, డైరెక్టర్లుగా చొచ్చుపట్ల కొండలరావు, కరణం శ్రీహరి నియమితులయ్యారు. శంకరరావు జనసేన పార్టీ నాయకుడుగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈయన నియామకం పట్ల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తనకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నెరవేరుస్తానని శివశంకర్ అన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



పొట్నూరి శివశంకర్, దిమిలి

లక్కవరం సొసైటీ చైర్‌పర్సన్‌గా విజయ్‌బాబు

ఎలమంచిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కవరం సొసైటీకి పాలకవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. లక్కవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా కొలుకులూరి విజయ్‌బాబు, డైరెక్టర్లుగా ఉగ్గిన బాబూరావు, డి. భగవాన్‌లను నియమితులయ్యారు. చైర్‌పర్సన్‌గా నియమితులైన విజయబాబు టీడీపీ మండల అధ్యక్షునిగాను, పార్టీ జిల్లా ఉపాధ్యక్షునిగానూ సేవలందించారు. సీనియర్ నాయకుడు ఈయనకు ఈ పదవి లభించడం పట్ల టీడీపీ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



విజయ్‌బాబు, లక్కవరం

ఫార్మా కంపెనీలతో ప్రమాదకర వ్యాధులు

బల్క్‌డ్రగ్ పార్కు వద్దంటూ రాజయ్యపేట గ్రామస్థులు ఆందోళన

నక్కపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఫార్మా కంపెనీలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికే తమ జీవనోపాధి దెబ్బతిందని రాజయ్యపేట మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అనేక మంది క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ఎంతోమంది మృత్యువాతపడుతున్నారని, హెటెరో నుంచి వస్తున్న కాలుష్యంతో నరకం చూస్తున్నామని వాపోయారు. ఆదివారం బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు, పర్యావసానంపై మత్స్యకారులు పార్టీలకతీతంగా రాజయ్యపేట గ్రామస్థులు సమావేశమయ్యారు. సముద్ర జలాలు కలుషితం కావడంతో చేపల వేటకు మత్స్యకారులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారన్నారు. ఇటువంటి సమయంలో బల్క్‌డ్రగ్ పార్కు పేరుతో మరికొన్ని రసాయన పరిశ్రమలను ఏర్పాటు చేస్తే మరింత ఇబ్బందులు పడతామన్నారు. బల్క్‌డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకార నాయకులంతా పార్టీలకతీతంగా రాజీనామా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.



రాజయ్యపేటలో సమావేశమై చర్చిస్తున్న గ్రామస్థులు

వీధి కుక్కల దాడిలో 12 కోళ్లు మృతి

ఎలమంచిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని గొల్లలపాలెంలో ఆదివారం తెల్లవారు జామున వీధి కుక్కల దాడిలో 12 కోళ్లు మృతి చెందగా.. మరికొన్ని గాయపడ్డాయని స్థానికులు తెలిపారు. తెల్లవారుజామున కోళ్ల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో తాము తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని స్థానిక రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలో ఇటీవల కుక్కలు విపరీతంగా పెరిగిపోయి దారిన పోయే వారిపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. పట్టణంలో ప్రధాన రోడ్డు వెంబడి, కోర్టుపేట, యానాదికాలనీ, మిలట్రీకాలనీ, కాకివానివీధి, రామ్‌నగర్, ధర్మవరం ప్రాంతాల్లో వీధి కుక్కలు అధికంగా ఉన్నాయి. కుక్కల దాడులకు భయపడి చాలామంది 2వ ఆట సినిమాలకు సైతం మానుకున్నామని తెలిపారు. చీకటి పడితే అవసరమైతే తప్ప రోడ్డు మీదకు రావాలంటే భయమేస్తుందని పలువురు తెలిపారు. మునిసిపల్ ప్రజారోగ్యశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



తీవ్ర గాయాలైన కోళ్లను చూపుతున్న స్థానికుడు

రైతులతో 'సుఖీభవ'పై ప్రచారం చేయండి

» టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు జగన్



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు బొండా జగన్

మునగపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్న దాత సుఖీభవ పథకాన్ని రైతు లు భాగస్వామ్యంతో విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గ పరిశీలకుడు బొండా జగన్ పిలుపు నిచ్చాడు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం మండల టీడీపీ అధ్యక్షుడు పెంటకోట విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాక్టర్లు, ఎడ్ల బళ్లతో ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ, గవర, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్లు బీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు, తదితరులు పాల్గొన్నారు.

వరుస సెలవులతో రద్దీగా రైళ్లు, బస్సులు

ఎలమంచిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజుల పాటు సెలవులు రావడంతో రైల్వే, బస్ స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకూ శ్రావణ శుక్రవారం, రాఖీ పండుగ, ఆదివారం మూడు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో రైళ్లన్నీ ప్రయాణికులతో కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. అసలే మండుతున్న ఎండలకు తోడు ప్రయాణికుల రద్దీ కావడంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదే విధంగా బస్సుల్లో కూడా ప్రయాణికుల రద్దీ పెరిగింది.



ఎలమంచిలి రైల్వే స్టేషన్‌లో కౌంటర్ వద్ద ప్రయాణికుల రద్దీ

కష్టపడే వారికి బీజేపీలో సముచిత స్థానం

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

మునగపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కష్టపడే వారికి పార్టీ అధిష్ఠానం సముచిత స్థానం కల్పిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. మండలంలో వాడ్రాపల్లిలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, పేదలకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం తోటాడ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మళ్ల కాళేశ్వరరావు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, రాజాన సన్యాసినాయుడు, మళ్ల మల్లయ్య, పొలమరశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

ఆర్‌సీడీఎస్ జిల్లా అధ్యక్షుడిగా రాజశేఖర్‌రెడ్డి

పాయకరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ (ఆర్‌సీడీఎస్) జిల్లా అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన గుడిమెట్ల రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఆర్‌సీడీఎస్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి తనను జిల్లా అధ్యక్షుడిగా నియమించి నట్టు రాజశేఖర రెడ్డి ఆదివారం తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



9 మంది కోడి పందెం రాయుళ్ల అరెస్టు

ఎస్.రాయవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరి శివారులో కోడి పందేల శిబిరంపై ఆదివారం దాడి చేసి 9 మంది పందెం రాయుళ్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.730 నగదు, మూడు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు.

దళితులపై దాడులు కొనసాగిస్తున్న వైసీపీ

» మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం

మునగపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో వైసీపీ దళితులపై దాడులు చేస్తూనే వచ్చిందని, ఇప్పుడు కూడా అవే దాడులు కొనసాగిస్తోందని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డొక్కా నాగభూషణం ఆరోపించారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దళిత వర్గానికి చెందిన డాక్టర్, డ్రైవర్‌తో పాటు పలువురును పొట్టన పెట్టుకుందన్నారు. మాజీ సీఎం జగన్ కారు కింద దళితుడిని చంపేశారని, ఇటీవల తిరుపతిలో భూమాన కరుణాకరరెడ్డి అనుచరులు రెచ్చిపోయి దళిత యువకుడును గదిలో బంధించి దౌర్జన్యం చేశారని తెలిపారు. దళితులపై వైసీపీ చేస్తున్న దాడులకు జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యత వహించి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో దళిత నాయకులు రేబాక మాలతి, గోవాడ వెంకటరమణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డొక్కా నాగభూషణం

బోర్డు తిప్పేసిన ఇఫ్కో

... 5వ పేజీ తరువాయి

లావణ్య, శనివారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనలాగే మొత్తం ఎనిమిది మంది రూ.5 లక్షల చొప్పున రూ.40 లక్షలు ఇఫ్కోకు ఇచ్చి మోసపోయినట్టు చెప్పారు. కాగా ఇఫ్కో కార్యాలయం కోసం అద్దెకు తీసుకున్న భవన యాజమాని నుంచి కూడా డీలర్‌షిప్ పేరుతో రూ.5 లక్షలు వసూలు చేశారు. మరోవైపు ఏడు నెలల నుంచి అద్దె ఇవ్వడంలేదు.

హోరాహోరీగా ఖోఖో పోటీలు

పాయకరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతరాష్ట్ర ఖోఖో పోటీలు ఆదివారం రెండోరోజు హోరాహోరీగా సాగాయి. అండర్-14, 17, 19, విభాగాల్లో బాలబాలికలకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. రెండో రోజు అండర్-19 బాలికల విభాగంలో జరిగిన పోటీల్లో సిస్టర్ నివేదిత స్కూల్ (హైదరాబాద్) ప్రథమ స్థానం సాధించగా, ద్వితీయ స్థానంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ (తిరుపతి), తృతీయ స్థానాన్ని సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ (ఏలూరు), హార్వెస్ట్ పబ్లిక్ స్కూల్ (ఖమ్మం) కైవసం చేసుకున్నాయి. ఇక మిగిలిన విభాగాల్లో వివిధ జట్ల మధ్య హోరాహోరీగా పోటీలు సాగాయి. వీటిలో పలు జట్లు సత్తాచాటి క్వార్టర్ ఫైనల్స్ దిశగా దూసుకుపోయాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్. విజయ్‌ప్రకాష్, సీబీఎస్ఈ పరిశీలకులు సీహెచ్ఎల్ఎం.శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.అపర్ణ పాల్గొన్నారు.

'ఐక్యంగా కాపుల సమస్యలు పరిష్కరించుకోవాలి'

అచ్యుతాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాపులంతా ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని శ్రీకృష్ణదేవరాయ కాపు సంక్షేమ భరోసా కేంద్రాల వ్యవస్థాపకుడు కర్రి వెంకట రమణ అన్నారు. ఆదివారం మండలంలోని కొండకర్ల ఆవలోని పెద్దింటమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన జిల్లా కాపు యూత్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపుల సంక్షేమానికి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వంగవీటి మోహన్‌రంగా కాపు యూత్ సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్‌గా రాంబిల్లి మండలం పెదకలవలాపల్లికి చెందిన రావి దేముళ్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో నేతలు హరీష్, పీలా శ్రీను, రామకృష్ణ, వెంకటేష్, నగేష్, నరేష్, శ్రీను, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు ప్రారంభం

అచ్యుతాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా అండర్-16 బాల్‌బ్యాడ్మింటన్ బాలబాలికల టోర్నమెంట్‌ని నునపర్తిలో శ్రీరామ బాల్‌బ్యాడ్మింటన్ క్లబ్ చైర్మన్ వీవీ నగేష్ ఆదివారం ప్రారంభించారు. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో బాలురు నుంచి పది, బాలికల నుంచి పది జట్లును ఎంపిక చేస్తారన్నారు. అలాగే సీనియర్స్ విభాగం నుంచి కూడా మహిళలు, పురుషుల జట్లు ఎంపిక చేస్తారని అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంప నరసింహనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎం. అచ్చంనాయుడు, కార్యనిర్వాహక కార్యదర్శి పదహూడి శంకరరావు, డీఏవీఎన్ రాజు, డి. ఆదినారాయణ, వీర ప్రజ్ఞ, మాసవరపు అప్పారావు, జి అప్పల రాజు, రెడ్డి దేముడు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బ్రాండిక్స్ నిర్వహిస్తున్న 141వ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన శిబిరానికి 600 మంది హాజరు కాగా.. అందులో 450 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 300 మందికి కంటి అద్దాలు ఇవ్వగా, కంటి ఆపరేషన్లకు 41 మందిని ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన వారందరికీ మజ్జిగ, పులిహోరతో పాటు ఉచిత భోజన సదుపాయం కూడా కల్పించారు. ఆపరేషన్లకు ఎంపికైన వారికి విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయిస్తామని, ఆపరేషన్లు అయి ఇంటికి చేర్చిన వరకు భోజన వసతి సౌకర్యాలు బ్రాండిక్స్ భరిస్తుందని యాజమాన్యం తెలిపింది.

ఆటో కార్మికులకు న్యాయం చేయాలి : సీఐటీయూ

అచ్యుతాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు న్యాయం జరిగే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము కోరారు. ఆదివారం ఆటో కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అమలులో భాగంగా ఈనెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తున్నందున స్వయం ఉపాధి పొందుతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలన్నారు వీరికి వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాము, దమ్ము చండీ, రాజు, కర్రి నాయుడు, శ్రీను పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక ఆటో కార్మికులతో కలిసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకాన్ని తీసుకువచ్చి ఆటో కార్మికులకు అన్యాయం చేయడం సరికాదన్నారు. ఉచిత బస్సు పథకం ద్వారా నష్టపోయే ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, కార్మికులు భూపతి అప్పారావు, దేవుడు, తాతారావు, లక్ష్మణ, దావీదు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపం ఏర్పాటుకు ముహూర్తపు రాట

ఎలమంచిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలకు మండపం ఏర్పాట్లలో భాగంగా ఆదివారం రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద ముహూర్తపు రాటను వేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, బొడ్డేడ ప్రసాద్, హైరామ్, బ్లాక్ ఇన్‌చార్జులు బి.శ్రీను, జగదీష్, రమేష్, దుర్గాప్రసాద్, లోకేష్, గంగాధర్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాధికారి రమణ సేవలు భేష్'

మునగపాక, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మునగపాక శాఖా గ్రంథాలయాధికారి ఎల్‌వీ రమణ తన విధులను సక్రమంగా నిర్వహించి, అందరి మన్ననలు పొందారని విశ్రాంతి ఉపాధ్యాయుడు పెంటకోట తులసీరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయాధికారి రమణ నుంచి అచ్యుతాపురం బదిలీ అయిన సందర్భంగా ఆదివారం ఆయన్ని పాఠకులు, బీడీసీ కేంద్రాల నిర్వాహకులు సత్కరించారు. నూతన గ్రంథాలయాధికారిగా బాధ్యతలు చేపట్టిన దాడి వరలక్ష్మికి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో తిమ్మరాజుపేట గ్రంథాలయాధికారి దొడ్డి కోటేశ్వరరావు,బీడీసీ కేంద్రాల నిర్వాహకులు ఆళ్ల మహేశ్వరరావు, సూరిబాబు, తులసీరావు, అప్పారావు, జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

రేబాక సర్పంచ్‌కు పితృ వియోగం

నక్కపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనుకు పితృ వియోగం కలిగింది. సర్పంచ్ తండ్రి రమణ గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మధ్యాహ్నం స్వగృహంలో తుది శ్వాస విడిచారు. సర్పంచ్ శ్రీను, కుటుంబసభ్యులను వీహెచ్‌పీ జిల్లా మాజీ అధ్యక్షుడు గొట్టుముక్కల శ్రీహరిరాజు, ఎంపీటీసీ సభ్యురాలు వెల్లంకి ధనలక్ష్మి, కాసుబాబు, గ్రామ పెద్ద సాదిరెడ్డి చిన వెంకన్న పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు.



సాదిరెడ్డి రమణ (ఫైల్)


రోగులకు పాలు, పండ్లు పంపిణీ

పాయకరావుపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం పట్టణ బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరంగం రమేష్, జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ రత్నభరత్ తదితరులు రోగులకు పాలు, పండ్లు, రొట్టె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వేముల రమణ, పట్టణ అధ్యక్షుడు కువల కుమార్, బీజేఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆచంట శ్రీకాంత్, గొర్ల వెంకటరమణ, దాడి శ్రీను, మునసాల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు

» ఇబ్బంది పడిన భవనం వీధి వాసులు

ఎలమంచిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనవాసాల మధ్య ఖాళీ స్థలాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెడుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పట్టణంలోని భవనం వీధి వాసులు వాపోతున్నారు. భవనం వీధిలో ప్రతి రోజూ కొందరు ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు పరుపులు, తదితర సామగ్రిని తీసుకువచ్చి నిప్పు పెడుతున్నారని వారు తెలిపారు. దీంతో వీధిలో నల్లని పొగ కమ్ముకుని తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందని స్థానికులు తెలిపారు. ఈ వాసన పీల్చిన తరువాత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వారంటున్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



భవనం వీధిలో ప్లాస్టిక్ వ్యర్థాల పొగ

అనకాపల్లిలో విభిన్న వాతావరణం

▸ ఉదయం పూట వర్షం.. మధ్యాహ్నం ఎండ

▸ గత రెండు రోజులుగా ఇదే పరిస్థితి



అనకాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో గత రెండు రోజులుగా విభిన్న వాతావరణం నెలకొంటోంది. ఉదయం వర్షం కురవడం, మధ్యాహ్నం భానుడు విశ్వరూపం చూపుతుండడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఆదివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఉదయం పదకొండున్నర గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై సుమారు ఇరవై నిమిషాలకుపైగా వర్షం పడడంతో పలు రోడ్లలో నీరు నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాసేపు వాతావరణం చల్లబడినప్పటికీ ఆ తరువాత మధ్యాహ్నం రెండున్నర గంటల తర్వాత ఎండతో పాటు ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేసింది. దీంతో ఇదేం వాతావరణం అంటూ అంతా ఆశ్చర్యపోతున్నారు. అన్నదాతలు మాత్రం ఆందోళనకు గురవుతున్నారు. సకాలంలో వర్షాలు కురవడం లేదని, ప్రస్తుతం చాలా చోట్ల నారుమడులకు తడులు అందడం లేదని ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది పంట దిగుబడి ఎలా ఉంటుందోనని మదనపడుతున్నారు.

భక్తిశ్రద్ధలతో మరిడిమాంబ ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి కోట్నివీధిలో ఈనెల 14న మరిడిమాంబ జాతర జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఘటాలను ఆదివారం రాత్రి ఊరేగించారు. పరిసర ప్రాంతాల్లోని మహిళలు ఘటాలను తలపై పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి సమర్పించి దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోట్ని పూర్ణ చంద్రరావు హరినాథ్, 84వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, వార్డు అధ్యక్షుడు తలారి లక్ష్మీప్రసాద్, కోట్ని రామకృష్ణ, ధర్మకర్తలు ఇ.శ్రీనివాసరావు, నగిరెడ్డి మధు, మారిశెట్టి సాయి, గొర్లి రమణమ్మతో పాటు కోట్ని అయ్యన్నదొర, కోట్ని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

13న 'క్విట్ కార్పొరేట్స్'



సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న రైతు కూలీ సంఘం ప్రతినిధులు

తుమ్మపాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 13న అనకాపల్లిలో చేపట్టనున్న క్విట్ కార్పొరేట్స్ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహన్ రావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. దీంతో చిన్న, సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదముందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ క్విట్ కార్పొరేట్స్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.శంకరరావు, వి.శ్రీనివాసరావు, కనిశెట్టి సురేష్‌బాబు, నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

'సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి'

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సోషల్ సర్వీస్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేవీ గౌరీపతి అన్నారు. సోషల్ సర్వీస్ గ్రూప్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఇక్కడి జార్జిక్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ఏడాది కాలంలో అనకాపల్లి మండల పరిధిలో మాత్రమే కాకుండా ఇతర మండలాల్లోని ప్రేమ సమాజాలు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి తొమ్మిది సంస్థలకు అవసరమైన నిత్యావసర సరకులు, బట్టలు, గృహోపకరణాలు అందించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించిన రిటైర్డు తహసీల్దార్ వీరభద్రరావును, ఘనంగా సత్కరించారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించి సభ్యులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంబీవీ స్వామి, క్లబ్ కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

శారదానగర్‌లో మురుగు సమస్య

▸ చిన్నపాటి వర్షం కురిసినా నాలుగు, ఆరు వీధుల్లో రోడ్లపైకి చేరి తిష్ట

▸ అడుగు తీసి అడుగేయలేకపోతున్న నివాసితులు

▸ కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడం వల్లే ఈ దుస్థితి



శారదానగర్ ఆరో వీధిలో రోడ్డుపై నిలిచిపోయిన మురుగు

కొత్తూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ కొత్తూరులోని శారదానగర్ నాలుగు, ఆరు వీధులను మురుగు సమస్య వీడడం లేదు. మోస్తరు వర్షం కురిసినా కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లో నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల చిన్నపాటి చెరువును తలపించేలా నీరునిలిచిపోతుండడంతో నివాసితులు అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి నెలకొంటోంది. దీర్ఘకాలంగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు కాలువలను శుభ్రం చేయకపోవడం వల్లే ఈ దుస్థితి ఏర్పడుతోందని అంటున్నారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోతోందని ఆరోపిస్తున్నారు. ఫలితంగా ఓ వైపు దుర్వాసన, మరోవైపు దోమల బెడదతో అవస్థలు పడుతున్నామంటున్నారు. దీనికితోడు చుట్టుపక్కల పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో తేళ్లు, పాములు వంటి వాటి బెడద అధికంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఈ సమస్యపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాల్సిందిగా అంతా కోరుతున్నారు.



నాలుగో వీధిలోని కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం

పరిశ్రమల్లో నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిందే

▸ అవసరమైతే ఆందోళన : ఎమ్మెల్యే రమేశ్‌బాబు



రోడ్డు ప్రారంభోత్సవం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రమేశ్‌బాబు

పరవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఇండస్ట్రియల్ పార్కులో గల పరిశ్రమల్లో ఈ.బోనంగి నిర్వాసితులకు ఉపాధి కల్పించాల్సిందేనని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు స్పష్టం చేశారు. బొద్దపువానిపాలెంలో ఉపాధి హామీ, పంచాయతీ నిధులు రూ.కోటి 50 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, ఇంటింటా కుళాయి కనెక్షన్లు, సూర్యఘర్ పథకం కింద ఏర్పాటు చేసిన సోలార్‌లైట్లను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. భూములు కోల్పోయిన నిర్వాసితులను కాదని ఇతర ప్రాంతాల వారికి పరిశ్రమల్లో ఉపాధి కల్పించడం దారుణమన్నారు. అవసరమైతే ఈ విషయంతో నిర్వాసితులతో కలిసి పరిశ్రమల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. బొద్దపువానిపాలెం గ్రామాన్ని మోడల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాసకాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు అట్టా సన్యాసిఅప్పారావు, బుడిగి రామగోవిందరావు, మేడి శెట్టి బాలాజీనాయుడు, మేడిశెట్టి అప్పారావు, మోటూరు సన్యాసినాయుడు, చింతకాయల ముత్యాలు, మేడిశెట్టి వెంకటరావు, నగిరెడ్డి చిన్నారావు, వెలుగుల అనిల్‌కుమార్, మంత్రి గిరిప్రసాద్, చందక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం పరిరక్షణే ధ్యేయం

▸ యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగం పరిరక్షణే యూటీఎఫ్ ధ్యేయమని జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి అన్నారు. ఫెడరేషన్ 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఇక్కడి సీఐటీయూ కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా విద్యా విధానాలను మార్చరాదన్నారు. సమాజానికి ఉపయోగపడేలా విధానాలను రూపొందించాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచం అభివృద్ధి చెందుతున్న తరుణంలో భారతీయ విద్య కూడా పురోభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రొంగలి అక్కునాయుడు, జిల్లా కార్యదర్శి జి.ఎస్.ప్రకాశ్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్య బాబు, ఫెడరేషన్ నాయకులు మామిడి బాబూరావు, రవి, బండారు శంకర్, ఎంకే శ్రీకాంత్, రాము, వెంకటరమణ, ఆశ తదితరులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న చినబ్బాయి, తదితరులు

ఘనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలు

▸ విస్తృతంగా పార్టీ నాయకులు సేవా కార్యక్రమాలు



వైద్యాలయంలో బాలింతకు పండ్లు, రొట్టెలు అందిస్తున్న పరమేశ్వరరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన వేడుకలు ఆదివారం పలుచోట్ల ఘనంగా జరిగాయి. పార్టీ నాయకుడు పలకా రవి ఆధ్వర్యంలో పట్టణంలోని లెప్రసీ కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై చీరలు, దుప్పట్లు, పిల్లలకు చాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొడ్డేడ నాగేశ్వరరావు, కర్రి రామకృష్ణ, నరసింగయాదవ్, బొడ్డేడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు బాలింతలకు, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు గంగుపాం నాగేశ్వరరావు అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయంలో మాధవ్ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్బవరం మండలంలో...

సబ్బవరం : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని గొటివాడలో గల జనరేషన్ యువ అనాథాశ్రమంలో పిల్లలకు భోజనాలను ఏర్పాటు చేశారు. అంతకు ముందు కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గొంప నర్సింగరావు, నాయకులు రెడ్డి రామునాయుడు, మండల స్వామి చక్రవర్తి, శ్రీనివాసవర్మ, పెచ్చేటి అప్పారావు, గొర్లె దేముడుబాబు, ప్రభాకర్, బి.అప్పారావు తదితరులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌరీ గ్రంథాలయ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

▸ నాలుగోసారి కార్యదర్శిగా 'కాండ్రేగుల'





రమణాజీ, అధ్యక్షులు..., వెంకటరమణ, కార్యదర్శి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సుమారు ఎనిమిదిన్నర దశాబ్దాల ఘన చరిత్ర కలిగిన గౌరీ గ్రంథాలయం నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం ఇక్కడ జరిగాయి. నాలుగోసారి కార్యదర్శిగా కాండ్రేగుల వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా బుద్ద రమణాజీ, ఉపాధ్యక్షులుగా యల్లపు శ్రీను, దాడి వీరునాయుడు, సహాయ కార్యదర్శులుగా బుద్ద జోగినాయుడు, కాండ్రేగుల నూకరాజు, కోశాధికారిగా ఆడారి మోహనవెంకటరామచంద్రరావు, కన్వీనర్‌గా బొడ్డేడ అప్పారావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నూకాంబిక దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల వెంకటరావు, దాడి స్వామినాయుడు, పి.నరసింగరావు వ్యవహరించారు. కార్యవర్గ సభ్యులుగా 23 మంది నియమితులయ్యారు. కాండ్రేగుల వెంకటరమణ కార్యదర్శిగా నాలుగో సారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

84వ వార్డులో రూ. 6.8 కోట్లతో అభివృద్ధి పనులు

▸ కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి



విలేకరుల సమావేశంలో అభివృద్ధిని వివరిస్తున్న చినతల్లి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 84వ వార్డులో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి తెలిపారు. ఆదివా రం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రూ.ఆరు కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీలా గోవింద సత్యనారాయణల సహకారంతో ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. పెరుగుబజార్ జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణ పనులకు రూ.98 లక్షలు, రింగు రోడ్డులోని కోల్డ్ స్టోరేజీ జంక్షన్ నుంచి విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వరకు రహదారి నిర్మాణానికి రూ.94.10 లక్షలు మంజూరైనట్టు చెపారు. అలాగే కొప్పాక జంక్షన్ నుంచి ఆర్టీవో కార్యాలయం వరకు డ్రైనేజీల నిర్మాణానికి రూ. 49.90 లక్షలు, డాక్టర్ హిమశేఖర్ డిగ్రీ కాలేజీ, స్కేటింగ్ పార్కు, గురజాడ స్కూల్, మరిడిమాంబ ఆలయం వరకు సీసీ రోడ్లు వేశారన్నారు. ఈ సమావేశంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు, వార్డు అధ్యక్ష, కార్యదర్శులు తలారి లక్ష్మీప్రసాద్, సాలాపు మోహన్, పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, పిళ్లా తారకేసు తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

కశింకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. జమాదులపాలెంలో మొల్లి సూర్యఅప్పారావు, శ్యామల (25) భార్యాభర్త నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో పశువుల పాకల వద్ద అదే గ్రామానికి చెందిన వియ్యపు ఈశ్వరరావు, వియ్యపు రాజేశ్వరిలతో శ్యామలకు గొడవ జరిగింది. దీనికి మనస్థాపం చెందిన ఆమె ఆ పాకల వద్ద ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఇది చూసిన రైతులు ఆటోలో ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా శ్యామల అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అన్నయ్య గొర్లి అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

పరవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవానిపాలెం శివారులో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. తిక్కవానిపాలెం గ్రామ శివారు తోటల్లో పేకాట జరుగుతున్నట్టు పోలీసులకు స్థానికులు ముందస్తు సమాచారాన్ని అందించారు. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి, రూ.1,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు

చీడికాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ.పట్నం గ్రామానికి చెందిన వృద్ధురాలు గండి పైడితల్లమ్మ హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు కె.కోటపాడు సీఐ తెలిపారు. అదే గ్రామానికి చెందిన కుదర పవన్‌సాయి ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు ఎల్‌బీ.పట్నం గ్రామానికి రాగా, 9వ తేదీన వేకువజాము 4 గంటలకు బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలు గండి పైడితల్లమ్మను రాయితో కొట్టి హత్య చేసినట్టు చెప్పారు. పరారీలో ఉన్న నిందితున్ని ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. నిందితుడ్ని కోర్టుకు తరలించారని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ బి.సతీశ్ పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లికి విశేష పూజలు

కశింకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో సత్తెమ్మతల్లి పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో మహిళలు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూటమి నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు దర్శించుకున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో కార్మికులు ఆందోళన



ఆందోళనలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పరవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. పరవాడలో ఆదివారం ఆటో కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఆటో కార్మికులకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలని, గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబరు 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, రాము, అప్పలరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాడేరు-భద్రాచలం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ పునరుద్ధరించాలి

చింతపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాడేరు- భద్రాచలం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీసును పునరుద్ధరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. చింతూరు, మోతుగూడెం, సీలేరు మీదుగా ప్రయాణించే ఈ సర్వీసుని 20రోజుల క్రితం పాడేరు డిపో అధికారులు నిలిపివేశారు. దీంతో ఈ మార్గంలోని ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో నున్న శివారు ప్రాంతాల ప్రజలు పాడేరు వచ్చి వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు పూర్తి చేసుకుని స్వగ్రామాలకు వెళ్లేందుకు అనువుగా ఉండేందుకు కలెక్టర్ ఏఎస్ దినేశ్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని పాడేరు-భద్రాచలం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్‌ను ఏర్పాటు చేశారు. ఆదాయం తక్కువగా వస్తుందని ఆర్టీసీ అధికారులు ఈ సర్వీసుని నిలిపివేయడం వల్ల చింతూరు ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి ప్రజలు రావడానికి తీవ్ర ఇబ్బందుపడుతున్నారు. అలాగే, ప్రస్తుతం పాడేరులో సాయంత్రం నాలుగు గంటలకు ప్రయాణమవుతున్న ఆర్టీసీ సర్వీసు మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైతే మరింత ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి భద్రాచలం-పాడేరు ఆర్టీసీ సర్వీసును వెంటనే పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాముకాటుకు గురైన టీడీపీ కార్యకర్తకు పరామర్శ


టీడీపీ కార్యకర్త సత్తిబాబుని పరామర్శిస్తున్న పార్టీ నాయకులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంచుల పంచాయతీ చెరపల్లి గ్రామానికి చెందిన సద్దా సత్తిబాబు రెండు రోజుల క్రితం పాముకాటుకి గురికావడంతో చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, నాయకులు అతడిని పరామర్శించి, పండ్లు, రొట్టెలు అందజేశారు. త్వరగా కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాడేలా పాండురాజు, మొట్టడం ఎంవీవీఎస్ఎన్ ప్రసాద్, అరడా గాబ్రియేలు, ముర్ల బాబూరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి


మాతాజీ, ఆచార్యుల శిక్షణలో మాట్లాడుతున్న ఉమా నీలకంఠేశ్వర ఆలయ ధర్మకర్త

పాడేరురూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లోని దేవాలయాల వద్ద విద్యా బోధన చేస్తున్న మాతాజీలు, ఆచార్యులు (గురూజీ)లు హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలని ఉమానీలకంఠేశ్వస్వామి వారి సమేత రాజరాజేశ్వరి అమ్మ వారి ఆలయ ధర్మకర్త కొట్టగుళ్లి సింహాచలం నాయుడు సూచించారు. ఆలయ ఆవరణలో సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రముఖ్ సుబ్బారావు ఆధ్వర్యంలో గిరిజన గ్రామాల్లో దేవాలయాల వద్ద మాతాజీలు, ఆచార్యులు(గురూజీ)లకు ఆదివారం నిర్వహించిన ఒక్క రోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. గ్రామాల్లో గిరిజన యువతను మంచి మార్గంలో నడిపించేలా చూడాలన్నారు. వనవాసీ కల్యాణ ఆశ్రమ ముఖ్య ప్రముఖ్ పాంగి రామయ్య, ఆలయ ప్రధాన కార్యదర్శి ఉప్పల వెంకటరత్నం, ఉపాధ్యక్షులు కొట్టగుళ్లి రామారావు, సంయుక్త ప్రధాన కార్యదర్శి సిద్ధినాతి కొండలరావు, జిల్లాలోని వివిధ మండలాల గురూజీలు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు

... 5వ పేజీ తరువాయి

లక్ష్మీపురం వద్ద స్థలం సమకూర్చడంతో వెంటనే నిర్మాణ పనులు మొదలుపెట్టారు.

అస్తవ్యస్తంగా విద్యుత్ సరఫరా

చోడవరంలో ప్రస్తుతం వున్న సబ్‌స్టేషన్ కింద సుమారు 20 వేల విద్యుత్ కనెక్షన్లు వున్నాయి. వీటిలో 11 వేల కనెక్షన్లు ఒక్క చోడవరం పట్టణంలోనే వున్నాయి. నానాటికీ విద్యుత్ కనెక్షన్లు పెరుగుతుండడం, మరో వైపు విద్యుత్ వినియోగం అధికం కావడంతో సబ్‌స్టేషన్‌పై లోడ్ పెరిగిపోతున్నది. దీంతో అప్రకటిత విద్యుత్ కోతలు, లోఓల్టేజీ సమస్యతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సబ్‌స్టేషన్‌పై లోడు తగ్గించడానికి పంచాయతీలకు సరఫరా నిలిపివేసి చోడవరం పట్టణానికి సరఫరా ఇస్తున్నారు. మరికొన్నిసార్లు చోడవరానికి సరఫరా ఆపేసి, చుట్టుపక్కల పంచాయతీలకు విద్యుత్ ఇస్తున్నారు. దీనివల్ల కరెంటు ఎప్పుడు ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటువంటి తరుణంలో ఎమ్మెల్యే రాజు, మరో సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంతవరకు సుమారు 60 శాతం పనులు పూర్తయ్యాయి. రెండు నెలల్లో ఇది అందుబాటులోకి వస్తుందని, దీంతో విద్యుత్ సమస్యలువుండవని అధికారులు చెబుతున్నారు.


అనంతగిరిలో నిరుపయోగంగా వదిలేసిన సామాజిక భవనం


లోపల పశువులతో దర్శనమిస్తోన్న దృశ్యం

పశువుల శాలగా.. సామాజిక భవనం!

- నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరిన వైనం
- అనంతగిరిలో శుభ కార్యక్రమాలకు వేదిక కరవు
- మరమ్మతులు చేపడితే సద్వినియోగం

అనంతగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సామాజిక భవనం శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారింది. వివరాలివి.. గతంలో పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యక్రమాలు, సమావేశాల నిర్వహణకు.. మండలవాసులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో 2003లో అప్పటి ఎంపీగా పనిచేసిన ఎంవీవీఎస్ మూర్తి తన నిధులనుంచి 5.50 లక్షలను మండల కేంద్రంలో సామాజిక భవనం నిర్మాణానికి కేటాయించారు. దీంతో నిర్మాణం పూర్తవడంతో 15 ఏళ్లపాటుగా పెళ్లి, ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలకు ఈ సామాజిక భవనం ఎంతగానో ఉపయోగపడేది. అనంతరం పట్టించుకోకపోవడం ప్రస్తుతం ఈ భవనంఅసాంఘిక కార్యకపాలకు అడ్డగా మారింది. తలుపు లేకపోవడం వర్షాకాలంలో పశువులకు స్థావరంగా మారుతోంది. కిటికీలు, రెండు తలుపులు వేయించి మరమ్మతులు చేయిస్తే.. భవనం అన్నివిధాలుగా ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, భవనం అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఎస్ఐ


వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రమణ

పెదబయలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని స్థానిక ఎస్ఐ కొల్లి రమణ సూచించారు. ఆదివారం పోలీస్ స్టేషన్ పరిధిలోని సంపంగిపుట్టు కూడలి వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. పలువురు ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోవడంపై అసహనం వ్యక్తంచేశారు. అలాగే ప్రైవేటు జీపు, ఆటోల్లో పరిమితికి మించిన పాసింజర్లను ఎక్కించడంపై మండిపడ్డారు. అనంతరం డ్రైవర్లతో నిర్వహించిన సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. వాహన రికార్డులు, డ్రైవర్ లైసెన్సులు చెంతన ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని చెప్పారు. మద్యం సేవించి, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు.ట్రాఫిక్ నియమాలను అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కానిస్టేబుల్ వెంకట్, సిబ్బంది ఉన్నారు.

త్రిలింగేశ్వరస్వామి మూలవిరాట్‌ను తాకిన సూర్యకిరణాలు


ఆలయంలోని మూల విరాట్‌పై సూర్యకిరణాలు

పాడేరురూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాడేరులోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న పురాతన శైవక్షేత్రం త్రిలేంగేశ్వరస్వామి స్వయం భూ లింగేశ్వరుని మూలవిరాట్‌ను ఆది వారం ఉదయం పూజా సమయంలో సూర్యకిరణాలు తాకడంతో భక్తులు ఆనందపరవశులయ్యారు. ఎన్నడూ లేని విధంగా శ్రావణ మాసంలో ఆదివారం సూర్యకిరణాలు మూలవిరాట్‌ను తాకడం విశేషమని ప్రధాన అర్యకులు ఈ సందర్భంగా తెలిపారు.

ఆగిపోయిన ఆర్టీసీ బస్సు... ప్రయాణికుల పాట్లు


జీకేవీధిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు వద్ద నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): తుని- సీలేరు ఆర్టీసీ బస్సు జీకేవీధి మండల కేంద్రంలో నిలిచిపోయింది. దీంతో మూడు గంటల పాటు ప్రయాణికులు మరో బస్సు కోసం నిరీక్షిస్తూ అవస్థలు పడ్డారు. ఆదివారం ఉదయం నర్సీపట్నం డిపోకి చెందిన సీలేరు ఆర్టీసీ బస్సు తునిలో ప్రారంభమైంది. ఉదయం 9:45నిమిషాలకు జీకేవీధి వచ్చింది. ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల బస్సు నిలిచిపోయింది. దీంతో డ్రైవర్ డిపో అధికారులకు సమాచారం ఇవ్వడంతో మరో బస్సుని పంపించారు. ఒంటిగంటకు ప్రయాణికులు మరో బస్సులో సీలేరు ప్రయాణమయ్యారు. గిరిజన ప్రాంతానికి కండీషన్‌లోనున్న ఆర్టీసీ బస్సులను పంపించాలని ఈ ప్రాంత ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్ యాత్ర

- ఇద్దరు యువకుల ప్రచారం


సైకిల్ యాత్ర చేస్తున్న నవీన్ పేమల, రాజ్‌కుమార్

అనంతగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, తెలంగాణలకు చెందిన ఇద్దరు యువకులు పర్యావరణ పరిరక్షణపై దేశవ్యాప్త సైకిల్‌యాత్ర చేస్తున్నారు. తిరుపతి జిల్లా నాగలపురంమండలం ఎస్ఎస్ పురం గ్రామానికి చెందిన నవీన్ పేమల డిగ్రీ బీఏ సైకాలజీ తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో చదివారు. గత ఏప్రిల్ 23న సైకిల్ యాత్రను అతను ప్రారంభించారు. అరుణాచలం, రామేశ్వరం, కశ్మీర్ తదితర ప్రాంతాల మీదుగా తెలంగాణ రాష్ట్రం చేరుకున్నారు. అక్కడ నుంచి కొత్తగూడెంలో రెండువారాల కిందట చేరుకున్న ఆయన యూట్యూబ్‌లో పరిచయంతో రాజ్‌కుమార్‌ను కలిశారు. అక్కడినుంచి వీరిద్దరూ సైకిల్‌యాత్రను మరింత ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు. భద్రాచలం మీదుగా సీలేరు చింతపల్లి, పాడేరు మీదుగా అరకులోయ, అనంతగిరి ఆదివారం చేరుకున్న వారు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.. నవీన్ పేమల మాట్లాడుతూ..సైక్లింగ్‌పై మక్కువతో సుదూర ప్రాంతాలకు ప్రయాణం సాగిస్తుంనున్నారు. ఇప్పటి వరకు 6 వేల కిలో మీటర్లు ప్రయాణించినట్టు చెప్పారు. అలాగే, సైక్లింగ్ చేయడం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. సత్తుపల్లి జేవీఆర్ కళాశాలలోని డిగ్రీ బీకాం చదువుకుని పర్యావరణం పరిరక్షణలో భాగంగా సేవ్ ట్రీ అని నినాదంతో సైక్లింగ్ చేస్తున్నట్టు చెప్పారు. దీనికి ముందు ఢిల్లీకి సైక్లింగ్ చేసుకుంటూ వెళ్లివచ్చినట్ట వివరించారు. ప్రస్తుతం చేపడుతున్న సైకిల్‌యాత్రలో కన్పించే పాఠశాలల వద్దకు వెళ్లి, మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని చెప్పారు. విశాఖపట్నం మీదుగా తాము తమ సొంత ఊర్లకు వెళ్తామని తెలిపారు.

ఏజెన్సీలోనే 'కాఫీ యూనిట్'ను ఏర్పాటు చేయాలి

- ఏపీ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర


సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాఫీ ప్రోసెసింగ్ యూనిట్‌ను ఏజెన్సీలోనే ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర డిమాండ్ చేశారు. స్థానిక జీఎస్‌యూ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సమీపంలో చెట్టిపాలెం వద్ద ఏర్పాటు చేయనున్న కాఫీ ప్రోసెసింగ్ యూనిట్‌ను ఏజెన్సీ ప్రాంతానికి తరలించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతగిరి, అరకు, పాడేరు, చింతపల్లి ప్రాంతాల్లో సుమారు 2 లక్షల ఎకరాలకు పైగా కాఫీ పెంపకం జరుగుతుందని, గిరిజన రైతులు ఇతర పంటలను వీడి కాఫీసాగు చేస్తున్నారన్నారు. పెద్ద ఎత్తున ముడి సరకు లభిస్తున్న ఏజెన్సీ ప్రాంతంలో కాకుండా మైదాన ప్రాంతానికి కాఫీ ప్రోసెసింగ్ సెంటర్‌ను తరలించడం సరికాదన్నారు.అరకులోయ, పాడేరు, చింతపల్లి, మారేడుమిల్లు ప్రాంతాలలో కాఫీ, మిరియాలు, ఇతర అటవీ ఉత్పత్తులకు అనుబంధ పరిశ్రమలు ఏర్పాటుకు అనువుగా ఉన్నాయన్నారు. చిన్నచిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ యువతకు ఉపాధి కల్పనకు.. బాక్సైట్ తవ్వకాలకు ముడిపెట్టి పెట్టడం తగదన్నారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టపులి శ్రీనివాసరావు పడాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ సోమెల సింహాచలం, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ఏపీసీపీఎస్‌జిల్లా అధ్యక్షుడు మాసాడ ఈశ్వరరావు, సాగిన కేశవరావు, కిరసాని వరకిశోర్, గిరిజన విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎన్నికల అధికారి డీవీఎస్ఎన్ రాజు

చింతపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) తాలూకా అధ్యక్షులుగా జి. సంజయ్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి డీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఆదివారం సబ్ డివిజన్ కేంద్రంలో కొయ్యూరు, చింతపల్లి, జీకేవీధి మండలాల ఏపీజీఈఏ ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా ఎ. శంకరరావు, అసోసియేట్ అధ్యక్షుడుగా గసాడి పద్మనాభం, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి. సుమసుందర్, ఉపాధ్యక్షులుగా పి. కిశోర్ చంద్ర, టి. మధుసూదనరావు, పి. నానిబాబు, కె. సింహాచలంలను ఎంపిక చేశారు. సంయుక్త కార్యదర్శులుగా ఎం. నాగరాజు, వి. శోభన్ బాబు, ఆర్. కన్నబాబు, కె. భాస్కరరావు, ఎస్ఎస్‌వీవీ ప్రతాప్ కుమార్, జె. పార్వతి, ఎస్. బాబూరావు, కోశాధికారిగా కె. సత్యవతి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గంతో ఎన్నికల అధికారి ప్రమాణం చేయించారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీఈఎస్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకుడు, జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి అజయ్ కుమార్ పాల్గొన్నారు.

మూతపడిన కాఫీ హౌస్

- ఉపాధి కోల్పోయిన కార్మికులు
- తెరవాలని విజ్ఞప్తి



డుంబ్రిగుడలో మూతపడిన కాఫీ హౌస్

డుంబ్రిగుడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న అటవీ ఉత్పత్తుల కేంద్రం, కాఫీ హౌస్ ఏడాదిన్నరగా మూతపడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే మండల కేంద్రాన్ని అధికారులు, అనధికారులు, పర్యాటకులు సందర్శిస్తుంటారు. వీరికి కాఫీ హౌస్ ఉపయోగపడేది. అయితే, జీసీసీ మేనేజర్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలు మూత వేశారు. దీంతో కాఫీ హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులు రోడ్డున పడ్డారు. కాఫీ హౌస్ పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని జీసీసీ మేనేజర్ ఇటీవల ప్రకటించినా ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంతోపాటు, వీటి నిర్వహణకు సంబంధించి నిధులు పక్కదారి పట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనాఉన్నత అధికార యంత్రాగం స్పందించి మండల కేంద్రంలోని కాఫీ హౌస్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

గిరిజనాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

- రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్


మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

పాడేరురూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గిరిజనాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఆదివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 9వ తేదీన పాడేరు మండలంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం విజయవంతానికి కృషి చేసిన అధికారులకు, ఆదివాసీలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గిరిజన అభివృద్ధికి చిత్తశుద్ధి కృషి చేస్తామని ప్రకటించారన్నారు. జీవో 3 స్థానంలో ప్రత్యామ్నాయం చూపేది కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ఆదివాసీ ప్రాంత అభివృద్ధికి ఐ టీడీఏలు ఏర్పాటు చేయడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం జీవో 275, 3లను చంద్రబాబు నాయుడు తీసుకురావడంతోనే గిరిజన కుటుంబాలు ఆర్థికాభివృద్ధితో పాటు ఉన్నత స్థానాలను అధిరోహించినట్టు శ్రావణ్‌కుమార్ తెలిపారు. గత ఐదేళ్ల పాలనలో జీవో 3పై నోరు మెదపని వైసీపీ నాయకులు నేడు మాట్లాడటం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. అరకు కాఫీ ప్రపంచ బ్రాండ్ కావాలని ప్యారిస్‌లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. ఏజెన్సీలో కొత్తగా మరో లక్ష ఎకరాల్లో కాఫీ తోటల పెంపకానికి చర్యలు చేపడుతున్న ఘనత టీడీపీదే అన్నారు.జిల్లాలోని అరకు, లంబసింగి, మారేడుమిల్లు తదితర పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి, బాకూరు పంచాయతీ సర్పంచ్ బాకూరు వెంకటరమణరాజు, దారెల పంచాయతీ సర్పంచ్ పాంగి పాండురంగస్వామి పాల్గొన్నారు.

బోర్డు తిప్పేసిన ఇఫ్కో

... 5వ పేజీ తరువాయి

లావణ్య, శనివారం సాయంత్రం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనలాగే మొత్తం ఎనిమిది మంది రూ.5 లక్షల చొప్పున రూ.40 లక్షలు ఇఫ్కోకు ఇచ్చి మోసపోయినట్టు చెప్పారు. కాగా ఇఫ్కో కార్యాలయం కోసం అద్దెకు తీసుకున్న భవన యాజమాని నుంచి కూడా డీలర్‌షిప్ పేరుతో రూ.5 లక్షలు వసూలు చేశారు. మరోవైపు ఏడు నెలల నుంచి అద్దె ఇవ్వడంలేదు.

ఇంటికి రాని కొళాయి!

... 5వ పేజీ తరువాయి

అనుగుణంగా నిధులు కేటాయింపు జరిగింది. జిల్లాలో 2022-23 సంవత్సరంలో ఈ పథకం కింద రూ.80.17 కోట్ల అంచనాలతో 405 పనులు చేపట్టడం ద్వారా 54,677 ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. అప్పట్లో జల్ జీవన్ మిషన్ పనులకు కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేసినప్పటికీ.. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయలేదు. పైగా కేంద్రం ఇచ్చిన నిధులను వేరే అవసరాలకు మళ్లించింది. ఫలితంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు అందలేదు. చాలా వరకు పనులు ఆపేశారు. మొత్తం మీద గత ఏడాది వైసీపీ అధికారంలో నుంచి దిగిపోయేనాటికి 27,823 ఇళ్లకు మాత్రమే కొళాయిలు ఏర్పాటు చేశారు. మిగిలిన పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. మరోవైపు ఇంజనీర్ల పర్యవేక్షణ లేకపోవడంతో చేసిన పనులు నాసిరకంగా వున్నాయి. ముఖ్యంగా నాణ్యతలేని పైపులు వాడడంతో వేసిన కొద్ది రోజులకే పగిలిపోయాయి. అనకాపల్లి, కె.కోటపాడు, దేవరాపల్లి, సబ్బవరం మండలాల్లో పైపులేస్లు వేసినప్పటికీ, ఇళ్లకు కొళాయి కనెక్షన్లు ఇవ్వలేదు. మొత్తం మీద జిల్లా వ్యాప్తంగా సగానికిపైగా పనులు పూర్తికాలేదు.

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పనులను పునరుద్ధరించడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. కానీ గతంలో చేపట్టిన పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సుమారు రూ.4.3 కోట్లు చెల్లించకపోవడంతో కొత్తగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే కొత్తగా ప్రతిపాదించిన పనులు చేపడతామని స్పష్టం చేశారు. దీంతో పెండింగ్ బిల్లులు చెల్లించడానికి నిధులు విడుదల చేయడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి చేతులు దులుపుకున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించి, సంబంధిత అధికారులను ప్రశ్నించారు.జిల్లాలో జల్ జీవన్ మిషన్ పనులు పునరుద్ధరణ కాకపోవడంపై ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రామస్వామిని 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి వివరణ కోరగా.. గతంలో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం కారణంగా కొంతమంది కాంట్రాక్టర్లు పనులు మధ్యలో ఆపేశారని చెప్పారు. నిధుల విడుదలతోపాటు పనులను పునఃప్రారంభించడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదన పంపామని చెప్పారు. నిధులు విడుదలైన వెంటనే చెల్లింపులు జరిపి, పనులు మొదలుపెట్టిస్తామన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. దారిలో అనకాపల్లి పట్టణ శివారులోని 'డైట్' కళాశాల దాటిన తరువాత ముందు వెళుతున్న వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడిని ప్రథమ చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు పంపారు. వెంకటేశ్ అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖరం తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

చీడికాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పొలంలో గడ్డి కోస్తున్న మహిళపై విద్యుత్ తీగ తెగిపడడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఎస్ఐ బి.సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జైతవరం గ్రామానికి చెందిన లాలం లక్ష్మణమ్మ ఆదివారం ఉదయం బి.సింగవరం సమీపంలో వున్న తన పొలంలో గడ్డి కోసుకురావడానికి వెళ్లింది. పొలంలో నుంచి విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. ఆమె గడ్డికోస్తుండగా విద్యుత్ వైరు తెగిపడింది. దీంతో ఆమె విద్యుదాఘాతానికి గురైంది. పొలానికి వెళ్లిన లక్ష్మణమ్మ ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లారు. అక్కడ లక్ష్మణమ్మ నిర్జీవంగా పడివుంది. ఆమెను అనుకొని విద్యుత్ తీగవుంది. దీంతో ఆమె భర్త పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సతీశ్, పోలీసు సిబ్బంది వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పర్సంటేజీలు ఇస్తేనే బిల్లులు!

... 5వ పేజీ తరువాయి

చేసుకున్నారని, వారంతా అతని వర్గానికి చెందినవారేనని పేర్కొంటున్నారు.

అధికారులకు వేధింపులు

విశాఖ సర్కిల్ పరిధి సీతంపేటలో పనిచేసిన ఈఈ ఒకరు ఎస్ఈ శ్రీనివాస్ పనితీరు నచ్చక విభేదించారు. దీంతో సదరు ఈఈని నెల్లూరు బదిలీచేశారు. అతడు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుని ప్రస్తుతం ఇక్కడే పనిచేస్తున్నారు. గతంలో పార్వతీపురం ఎస్ఈగా పనిచేసిన అధికారిని తీవ్రంగా వేధించడంతోపాటు తనకున్న పలుకుబడితో అక్కడి ఎస్ఈ కార్యాలయాన్ని రద్దుచేయించారు. అక్కడ పనిచేసే ఎస్ఈని ఈఈగా రివర్షన్ చేశారు. ఈఈగా పనిచేసిన మరో అధికారిని డీఈగా రివర్షన్ చేయగా, చివరకు అదే కేడర్‌లో అతను ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చింది. శ్రీనివాస్ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యంలో విశాఖ ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో పనిచేస్తున్న అతని మనుషులు ఇప్పటికే కొన్ని ఫైళ్ల దాచేశారని తాజాగా ప్రచారం జరుగుతోంది. వాటిలో అనేక లోపాలు ఉండడంతో పొరపాటున ఏసీబీ అధికారులకు దొరికితే ఇబ్బందులు ఎదురవుతాయనే అప్రమత్తమయ్యారని కాంట్రాక్టర్లు వ్యాఖ్యానిస్తున్నారు.

కూటమి హయాంలోనే తాండవ అభివృద్ధి

... 5వ పేజీ తరువాయి

ఇచ్చారు. అనంతరం తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ అధ్యక్షతన ఆయకట్టు రైతులతో నిర్వహించిన సభలో స్పీకర్ మాట్లాడుతూ, తాండవ అభివృద్ధికి మరో రూ.20 కోట్లు మంజూరు చేయాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరగా, త్వరలో మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. తాండవ రహదారిని జలవనరుల శాఖ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు బదిలీ చేశామని, ఈ రహదారి అభివృద్ధికి త్వరలో రూ.8 కోట్లు మంజూరు అవుతాయని వెల్లడించారు. గొలుగొండ-నాతవరం మండలాలను కలిపే రహదారికి తాండవ జలాశయం వద్ద రక్షణగోడ నిర్మిస్తామన్నారు. రాష్ట్ర హోం మంత్రి అనిత మాట్లాడుతూ, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సాగు నీటి రంగం అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డీఈఈ అనురాధ, జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గం ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర, నర్సీపట్నం, తుని ఏఎంసీల చైర్మన్‌లు గవిరెడ్డి వెంకటరమణ, అంకంరెడ్డి రమేశ్, కూటమి నాయకులు లాలం కాశీనాయుడు, నందిపల్లి వెంకటరమణ, జోగిబాబు, పారుపల్లి దాసు, తాండవ ప్రాజెక్టు ఈఈ బాల సూర్య, నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తహశీల్దార్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎనిమిది సహకార సంఘాలకు చైర్‌పర్సన్ల నియామకం


చోడవరం సంఘ చైర్‌పర్సన్ మూలినాయుడు

చోడవరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనిమిది సహకార సంఘాలకు ప్రభుత్వం చైర్‌పర్సన్లను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక అధికారి బి.రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సంఘాలకు చైర్‌పర్సన్‌తో పాటు మరో ఇద్దరు పర్సన్‌లను కూడా నియమించారు. వీరి పదవీ కాలం వచ్చే ఏడాది వచ్చే ఏడాది జనవరి 30వ తేదీ వరకూ ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చోడవరం ప్రాథమిక సహకార సంఘానికి చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన గూనూరు మూలినాయుడు, పర్సన్‌లుగా దాడి నాగఅప్పారావు, కుర్రు సూర్యప్రకాశరావు నియమితులయ్యారు. అలాగే భోగాపురం సహకార సంఘానికి చైర్‌పర్సన్‌గా దొడ్డి సత్యనారాయణ, పర్సన్‌లుగా దేవర వెంకునాయుడు, గాలి శ్రీనివాస్‌ను నియమించారు. లక్ష్మీపురం సంఘానికి పాతాళం నాగేశ్వరరావు చైర్‌పర్సన్‌గా, పందూరి సన్యాసిరావు, నీలం శంకరరావు పర్సన్లుగా నియమితులయ్యారు. గవరవరం సహకార సంఘానికి చైర్‌పర్సన్‌గా తాటికొండ అవతారం, పర్సన్‌లుగా కొల్లి లక్ష్మీదేవి, జొన్నపల్లి వెంకటరమణ, గోవాడ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా ఏడువాక శ్రీనివాసరావు, పర్సన్‌లుగా నాగిరెడ్డి చినకాసులు, దాడి దుర్గునాయుడు, జుత్తాడ సహకార సంఘం చైర్‌పర్సన్‌గా దొడ్డి రామారావు, పర్సన్‌లుగా శిలపరశెట్టి సత్య వెంకట సూర్యారావు, దొడ్డి సత్యవరహ ప్రకాశరావు, రాయపురాజుపేట సహకార సంఘం చైర్‌పర్సన్‌గా బొడ్డేడ వెంకట అప్పారావు, పర్సన్‌లుగా దాడి కృష్ణ, తెలుగు చర్ల మహేశ్వరరావు నియమితులయ్యారు. అలాగే లక్కవరం సహకార సంఘానికి కొప్పు నారాయణరావు చైర్‌పర్సన్‌గా, నాగారాపు అప్పలరాజు, కర్రి వెంకట రమణ పర్సన్‌లుగా నియమితులయ్యారు.

రావణాపల్లి రిజర్వాయర్ నీరు విడుదల


రావణాపల్లి రిజర్వాయర్ నీటిని విడుదల చేస్తున్న కౌన్సిలర్ రాజేశ్

గొలుగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావణాపల్లి రిజర్వాయర్ నీటిని నర్సీపట్నం మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రిజర్వాయర్ గొలుగొండ, నర్సీపట్నం మండలాల్లో సుమారు 2900 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నదన్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల్లో పూడిక తొలగించి సిమెంట్ కాలువలుగా అభివృద్ధి చేశామన్నారు. అలాగే రిజర్వాయర్ గేటు మరమ్మతులు చేపట్టి నీటి నిల్వలు లీకవకుండా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులను రైతులు దృష్టిలో పెట్టుకుని సాగునీటిని వృథా చేయకూడదని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ జేఈ రుత్తల రామన్నపాత్రుడు, రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, స్థానిక నాయకులు కొల్లి సత్యనారాయణ,పెట్ల బాబులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఏఎల్ పురం అభివృద్ధి శూన్యం

- జడ్పీటీసీ మాజీ సభ్యుడు తారకవేణుగోపాల్


విలేకరులతో మాట్లాడుతున్న తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు

కృష్ణాదేవిపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏఎల్ పురం మేజర్ పంచాయతీలో జరిగిన అభివృద్ధి శూన్యమని గొలుగొండ జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిటికెల తారకవేణుగోపాల్ ఆరోపించారు. ఏఎల్ పురంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హెచ్చరించారు. ఏఎల్ పురాన్ని కూటమి ప్రభుత్వం ఎంతగా అభివృద్ధి చేసిందో తెలియదా అని ప్రశ్నించారు. వైసీపీ హయాంలో గ్రామంలో నిర్మించిన రెండు సచివాలయాలు, రైతు భరోసా, హెల్త్ సెంటర్లు తదితర భవనాల పనులు అసంపూర్తిగానే వదిలేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ గ్రామాన్ని దత్తత తీసుకుని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. వీటిపై వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఈ మావేశంలో నీటి సంఘం, స్కూల్ కమిటీ చైర్మన్లు లగుడు రాజు, స్వామినాయుడు, మువ్వల సత్యనారాయణ, టీడీపీ నాయకులు బొడ్డు జమీలు, గొంప వాసు, పోతల రాజులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఆరుగురిపై కేసు

పరవాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిక్కవానిపాలెం శివారులో పేకాట శిబిరంపై ఆదివా రం పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందుకు సంబంధించి సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపిన వివరాలివి. తిక్కవానిపాలెం గ్రామ శివారు తోటల్లో పేకాట జరుగుతున్నట్టు పోలీసులకు స్థానికులు ముందస్తు సమాచారాన్ని అందించారు. ఈ మేరకు పోలీసులు దాడులు నిర్వహించి, రూ.1,450 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

సంకల్పం సిద్ధించింది.. వసతి సమస్య తీరింది!


కొరుప్రోలులో శిథిల పెంకుల షెడ్డులోనే చిన్నారుల విద్యాభ్యాసం (ఫైల్)

పైకే చూడాలా.. పాఠాలే చదవాలా..? ఇదీ కొరుప్రోలు ప్రాథమిక పాఠశాలలో గిరిజన విద్యార్థుల దుస్థితి. శిథిలమైన పెంకుల షెడ్డులో పాఠశాలను నిర్వహించడమే ఇందుకు కారణం! అప్పటికే కొన్ని పెంకులు ఊడిపడగా, ఉన్నవి కూడా ఎప్పుడెప్పుడా..! అన్నట్టు ఉండడంతో చిన్నారులు బిక్కుబిక్కుమంటూ విద్యాభ్యాసం చేస్తున్నారు. మెగా పేరెంట్స్ డే సమావేశంతో ఈ సమస్యకు చెక్ పడింది.

- శిథిలమైన పెంకుల షెడ్డులోనే కొరుప్రోలు పాఠశాల
- బిక్కుబిక్కుమంటూ గిరిజన చిన్నారుల విద్యాభ్యాసం
- పేరెంట్స్ మీటింగ్‌లో కొత్త షెడ్డు నిర్మించాలని తీర్మానం
- గిరిజనులు, ఉపాధ్యాయుడు సహకారంతో సాకారం


గిరిజనులు, ఉపాధ్యాయుడు సహకారంతో నిర్మించిన రేకుల షెడ్డు

రోలుగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంకే పట్నం శివారు కొరుప్రోలు గిరిజన గ్రామంలో ఏడు కుటుంబాలకు చెందిన 60 మంది జనాభా ఉన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమి పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 11 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే చాలా సంవత్సరాలుగా ఈ గ్రామంలో విద్యార్థులు చదువుకునే పాఠశాలకు సరైన వసతి సౌకర్యం లేదు. స్థానికంగా ఉన్న పెంకుల షెడ్డును ఏర్పాటు చేసుకుని పిల్లలను చదువు చెబుతున్నారు. ఈ షెడ్డు కూడా శిథిల స్థితిలో ఉండడంతో గిరిజన పిల్లలు బిక్కుబిక్కుంటూ చదువుకునేవారు. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని గత వైసీపీ ప్రభుత్వం హయంలో నాడు-నేడు కింద పాఠశాల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా, రోడ్డు సౌకర్యం లేక పోవడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయి.

దీంతో అప్పటి నుంచి గ్రామంలోన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల భవన నిర్మాణం కల నెరవేరలేదు. కాగా గత నెల 10న మెగా పేరెంట్స్ సమావేశాలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ రోజు పాఠశాలలో ఉపాధ్యాయుడు వై.శివరామకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గెమ్మిలి సుబ్బారావు, తల్లిదండ్రులు సమావేశానికి హాజరయ్యారు. వారంతా వసతి సమస్యపై చర్చించారు.

శిథిలమైన పెంకుల షెడ్డులో పిల్లలు చదువుకోవడం ప్రమాదకరమని, ఎలాగైనా కొత్త షెడ్డు నిర్మించాలని వారంతా సంకల్పించారు. ఇందుకనుగుణంగా తీర్మానం చేసుకున్నారు. ఈ క్రమంలో గ్రామంలో గిరిజనులంతా ముందుకు రావడంతో పాటు ఉపాధ్యాయుడు శివరామకృష్ణ కూడా తనవంతుగా రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు. దీంతో ఈ నిధులతో నూతనంగా రేకుల షెడ్డును నిర్మించారు. ఇటీవల మండల విద్యా శాఖాధికారి జాన్‌ప్రసాద్ ఈ షెడ్డును ప్రారంభించారు. గ్రామస్థులు, ఉపాధ్యాయుడు చొరవ తీసుకుని పాఠశాలకు ఇలా వసతి సమకూర్చుకోవడాన్ని ఎంఈవో ప్రశంసించారు.

వాతావరణం.. విభిన్నం!

- రోలుగుంట మండలంలో వర్షాలు... గ్రామాల్లో ఖరీఫ్ పనులు


రత్నంపేటలో దమ్ము పట్టి వరి నాట్లకు సిద్ధం చేస్తున్న పొలం

రోలుగుంట, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షంతో రైతులు వరి నాట్ల పనులు ప్రారంభించారు. రత్నంపేట, బుచ్చెంపేట, శరభవరం, వడ్డిప, బీబీపట్నం, కొమరవోలు ఆవ సమీపంలో వరి నాట్లు, ఆకుతీతలతో రైతులు బిజీగా మారారు. మండలంలోని ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1450 హెక్టార్లుగా ఉంది. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ఎక్కడిక్కడ రైతులు దమ్ములు పడుతున్నారు. దీంతో పాటు స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఎరువులు సిద్ధంగా ఉన్నాయని వ్యవసాయాధికారి చిరంజీవి తెలిపారు.

- బుచ్చెయ్యపేటలో వర్షాలు లేక బీడు వారిన పొలాలు


నీరు లేక ఎండిపోతున్న వడ్డాది పాండువులు చెరువు ఆయకట్టు పొలాలు

బుచ్చెయ్యపేట ఆగష్టు 9 (ఆంధ్ర జ్యోతి): మండలంలో వడ్డాది పాండవుల చెరువు ఆయకట్టు పరిధిలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేకపోవడంతో ఈ ఆయకట్టు కింద సుమారు వంద ఎకరాల్లో ఖరీఫ్ పంట దెబ్బ తింటోంది. దీంతో వర్షాల కోసం రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు. వడ్డాది పెద్దేరు నదీ జలాలను లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువుకు నీరు సరఫరా చేసి ఆదుకోవాలని అధికారులను రైతులు కోరుతున్నారు. చెరువు నిండిన తరువాత చేపల పెంపకం ద్వారా మత్స్యకారులు జీవనం సాగుతుందన్నారు. వేలం ద్వారా పంచాయతీకి ఆదాయం సమకురుతుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రామన్నపాలెంలో జ్వరాల విజృంభణ

- గ్రామంలో లోపించిన పారిశుధ్యం
- వ్యాధుల భయంతో వణుకుతున్న జనం
- వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని బాధితుల విన్నపం

మాకవరపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం గ్రామంలో జ్వరాలు విజృంభించాయి. గత 15 రోజులుగా వైరల్ జ్వరాలతో పలువురు గ్రామస్తులు మంచం పట్టారు. ప్రధానంగా గ్రామంలో పారిశుధ్యం లోపించడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని జనం బెంబెలెత్తిపోతున్నారు. రహదారులపైనే చెత్తను పడేసి వదలివేయడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని. దీంతో కొద్ది రోజులుగా గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. జ్వరాలతో కొంత మంది మంచాలపై మగ్గుతున్నప్పటికీ వైద్యులు, సిబ్బంది ఇటు వైపు కన్నెత్తి అయినా చూడడం లేదని వారు తెలిపారు.


రామన్నపాలెం గ్రామంలో రోడ్డును ఆనుకుని పేరుకుపోయిన చెత్త కుప్పలు


జ్వరంతో మంచం పట్టిన కోరుప్రోలు నూకరాజు... బాలమ్మ

ఇప్పటికే గ్రామంలో కోరుప్రోలు నూకరాజు, మాకిరెడ్డి బాలమ్మ జ్వరాలతో బాధపడుతున్నారు. మరి కొంత మందికి జ్వరాలు ఎక్కువ కావడంతో కన్నూరిపాలెం, నర్సీపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. ఆదివారం జ్వర పీడితులు అల్లు కన్నబాబు, అల్లు కామేశ్వరి, మంగలి చిట్టెమ్మ, బెర్లా వెంక్కియ్యమ్మ, ఎస్.అజయ్, చుక్కా రాజులమ్మ, యకా గవరరాజు, బొల్లి దేముడు, గోరి సాంబ తదితరులు ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరారు. వీరే కాకుండా మరి కొందరు కాళ్లు, చేతుల నొప్పులతో బాధపడుతున్నారు. గ్రామానికి ఆనుకుని చెత్త కుప్పలు పేరుకుపోవడంతో రోగాలు పెరిగే ప్రమాదం ఉందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, పారిశుధ్యం మెరుగుపర్చాలని కోరుతున్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువ జాము ఆరు గంటల నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు, ముడుపులు చెల్లించుకున్నారు. అదే విధంగా మరికొంత మంది భక్తులు అమ్మవారి ఘటాల పండుగను నిర్వహించుకొని, ఇళ్ల వద్ద పూజించిన ఘటాలను నెత్తిన పెట్టుకొని గ్రామంలో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు వెళ్లారు. ఆలయానికి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలి


ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

నర్సీపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2003 బ్యాచ్ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎన్టీఆర్ మినీ స్టేడియం గాంధీ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. డీఎస్సీ 2003 బ్యాచ్ ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంలోకి బలవంతంగా నెట్టేసినట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో నంబరు-57 ప్రకారం ప్రభుత్వాల అలసత్వం వల్ల నియామకాలు ఆలస్యమైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయవచ్చునని పేర్కొన్నారని తెలిపారు. చాలా రాష్ట్రాలలో ప్రభుత్వ ఉద్యోగులను ఓపీఎస్ అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంతో మాట్లాడి 2003 బ్యాచ్ ఉపాధ్యాయులకు కూడా ఓపీఎస్ అమలు చేయాలని వారు కోరారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడితో సీఐ పైడపునాయుడు, ఎస్ఐ సతీశ్, పోలీసు సిబ్బంది

చీడికాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్‌బీ.పట్నం గ్రామానికి చెందిన వృద్ధురాలు గండి పైడితల్లమ్మ హత్య కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు సీఐ పైడపునాయుడు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కుదర పవన్‌సాయి ఈ నెల 8న మధ్యాహ్నం 2 గంటలకు ఎల్‌బి.పట్నం గ్రామానికి రాగా, 9వ తేదీన వేకువజాము 4 గంటలకు బహిర్భూమికి వెళ్లిన వృద్ధురాలు గండి పైడితల్లమ్మను రాయితో కొట్టి హత్య చేసినట్టు చెప్పారు. పరారీలో ఉన్న నిందితుడ్ని ఆదివారం ఉదయం 10 గంటలకు పట్టుకున్నట్టు ఆయన తెలిపారు. నిందితుడ్ని కోర్టుకు తరలించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ బి.సతీశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వివాహిత ఆత్మహత్య

కశింకోట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సం ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలివి. జమాదులపాలెంలో మొల్లి సూర్యఅప్పారావు, శ్యామల (25) భార్యాభర్త నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో పశువుల పాకల వద్ద అదే గ్రామానికి చెందిన వియ్యపు ఈశ్వరరావు, వియ్యపు రాజేశ్వరిలతో శ్యామలకు గొడవ జరిగింది. దీనికి మనస్థాపం చెందిన ఆమె ఆ పాకల వద్ద ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఇది చూసిన రైతులు ఆటోలో ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే కుటుంబ సభ్యులు అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా శ్యామల అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి అన్నయ్య గొర్లి అప్పలరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

రోలుగుంట పీఏసీఎస్‌కు త్రిసభ్య కమిటీ నియామకం

రోలుగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోలుగుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)కు త్రిసభ్య కమిటీని నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మండలంలోని నిండుగొండకు చెందిన మాజీ సర్పంచ్ సుర్ల బాబులునాయుడును చైర్‌పర్సన్‌గా, కొవ్వూరుకు చెందిన యర్రంశెట్టి వెంకట రమణ, వడ్డిపకు చెందిన బుంగా అప్పారావులను సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ కమిటీ పదవీ కాలం వచ్చే ఏడాది జనవరి నెలాఖరు వరకు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జానకీరాంపురం పీఏసీఎస్‌కు ఇప్పటికీ కమిటీ నియామకం జరగలేదు. రెండు, మూడు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తికానున్నట్టు సొసైటీ అధికారులు తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా చదవడం మాకిష్టం కార్యక్రమం

రోలుగుంట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం రోలుగుంట శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఆదివారం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి రాజుబాబు తెలిపారు. పిల్లలకు పుస్తక పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే కథల పుస్తకాలు, విజ్ఞానం అందించే పుస్తకాలు చదివించారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలు

కె.కోటపాడు, అగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ ఆధ్వర్యంలో బీజేపీ సీనియర్ నేత చల్లా సత్యనారాయణమూర్తి కేక్ కట్ చేశారు. పార్టీని దశదిశలా విస్తరిస్తున్న మాధవ్‌కు అందరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. నాయకులు ఎస్.సన్యాసినాయుడు, ఇమంది సన్యాసిరావు, జె.సూర్యనారాయణ, బి.సత్యనారాయణపాత్రుడు, బి.శ్రీరామమూర్తి, గంగునాయుడు, జి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

చీడికాడలో...

చీడికాడ: మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పాతాళం బాలకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచారు. చీడికాడ పీహెచ్‌సీ రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొగ్గ ఈశ్వరప్రసాద్, నాయకులు ఎం.శ్రీనివాస్, బాలకృష్ణ, సిహెచ్.శివాజీరాజు, సిహెచ్.కోటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.అప్పలనాయుడు, పి.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో...

నాతవరం: మండల కేంద్రంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సబీ కుమారస్వామి ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పేరూరి బుల్లిదొర, ఎల్.విక్రమ్, చింతకాయల నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది గ్రామంలో ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. గిరిజాంబ గిరిపై వేంకటేశ్వరస్వామి ఆలయంలో నాయకులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీతానాగరాజు, నాయకులు దూది రాజేశ్, డి.నానాజీ, జి.శ్రీను, జి.ఈశ్వరరావు, అయ్యన్నదొర, సయ్యపురెడ్డి మణికంఠ పాల్గొన్నారు.

13న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మాడుగుల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద నూతనంగా నిర్మించిన విజయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం, స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 13న వైభవంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా హోమం, సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.